జాతీయస్థాయి కరాటే పోటీలకు నవ్య

ఎంపికైన నవ్య

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 7 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రాయిపల్లికి చెందిన జెట్ట నవ్య జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైంది. గురువారం నల్లగొండలో జరిగిన రాష్ట్రస్థాయి 67వ ఎస్జీఎఫ్ కరాటే పోటీల్లో నవ్య ప్రతిభకనబర్చి బంగారు పథకాన్ని సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

సాధువెల్లిలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

యాదగిరిగుట్ట, డిసెంబర్ 7 : యాదగిరిగుట్ట మండలంలోని సాధువెల్లిలో గురువారం పార్వతీపరమేశ్వరుల కల్యాణమహోత్సవాన్ని పురోహితులు అత్యంత వైభవంగా జరిపారు. ఉదయం సుప్రభాత సేవ, వేద పారాయణం, యంత్రాభిషేకం, వాస్తు పర్యగ్ని కరణం, జప తర్పణాలు శాస్త్రోక్తంగా జరిగాయి. గర్తన్యాసం, రత్నన్యాసం, భీజన్యాసం, ధాతున్యాసం జరిపి సుమూర్తముల యంత్రస్థాపనలు, బింబ ప్రతిష్ఠ నిర్వహించారు. కళాన్యాసం ప్రాణ ప్రతిష్ఠ, నేత్రోన్మీలనం, ధేను, దర్పణ, దర్శనాలు, బలీహరణం, మహాకుంభాభిషేకం వైభవంగా జరిపారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ మార్కండేయ ఆలయ కమిటీ సభ్యులు బేతి బాలరాజు, బేతి గోపాల్, విశ్వనాథం, కటకం ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైన దర్గా

నేడు ఇప్పల్ల ఉర్సు

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 7 : మండలంలోని ఇప్పల్లలో అజారత్‌ఖాన్ నజిరోద్దిన్ దర్గాలో శుక్రవారం ఉర్సు ఉత్సవాలు జరుగనున్నట్లు నిర్వాహకుడు కాజాబందావెంకటసాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తాసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న తమ్మడపల్లి గ్రామస్తులు

తమ్మడపల్లి చెరువు భూమిని సర్వే చేయాలని వినతి

మర్రిగూడ, డిసెంబర్ 7 : మండలంలోని తమ్మడపల్లిలో సర్వే నంబర్ 82, 83,84లలో గల చెరువు భూమిని సర్వే చేయాలని కోరుతూ గ్రామస్తులు గురువారం తాసీల్దార్ శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొట్టం మాధవీరమేశ్, ఎంపీటీసీ గండికోట రాజమణీహరికృష్ణ మాట్లాడుతూ చెరువు భూమి కబ్జాకు గురి కావడంతో చెరువు పక్క నుంచి వెళ్లడానికి రైతులకు దారి లేకుండా పోయిందన్నారు. భూమిని పూర్తి స్థాయిలో సర్వే చేయించి ప్రభుత్వ భూమిని కాపాడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ అయిలీ యాదయ్య, గ్రామస్తులు గండికోట శ్రీరాములు, నర్సింహ, డేరంగుల వెంకటయ్య, అశోక్, రమేశ్ పాల్గొన్నారు.

కళాకారుడు పిచ్చయ్యకు జాతీయ నంది పురస్కారం

మఠంపల్లి, డిసెంబర్ 7 : భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కల్పనా కళానికేతన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన శివాని ఆర్ట్స్ నాటకోత్సవంలో జాతీయ నంది పురస్కారం అందుకున్నట్లు మఠంపల్లికి చెందిన ప్రముఖ సినీ, రంగస్థల కళాకారుడు గుంటి పిచ్చయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళారంగంలో అందిస్తున్న విశిష్ట సేవలతో పాటు పలు నాటికలు, ఏకపాత్రాభినయాలకు గుర్తుగా జాతీయ నంది పురస్కారంతో పాటు షీల్డ్, సువర్ణ కంకణధారణం, పుష్పక కిరీటంతో ఘనంగా సత్కరించినట్లు తెలిపారు.

పిచ్చయ్య జాతీయ నంది పురస్కారం అందుకోవడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రాజాపేట సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో సిద్ధం చేసిన క్రీడా మైదానం

రాష్ట్రస్థాయి గురుకుల క్రీడలకు ఏర్పాట్లు పూర్తి

రాజాపేట, డిసెంబర్ 7 : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 9 నుంచి 12 వరకు జరిగే 9వ రాష్ట్ర స్థాయి గురుకుల క్రీడలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రీజన్ ఆర్‌సీఓ, క్రీడల ఇన్‌చార్జి ఎన్.రజిన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలోని 8 జోన్లకు సంబంధించిన 1,171 మంది విద్యార్థులు ఏడు విభాగాల్లో నిర్వహించే క్రీడల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, టెన్నికైట్, కార్యమ్స్, చెస్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

● సైబర్ సెక్యూరిటీ సెల్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు

విద్యార్థులకు అవగాహనన కల్పిస్తున్న సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్‌రావు

సూర్యాపేట సిటీ, డిసెంబర్ 7 : సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ సెల్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని గౌతమి కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ లావాదేవీల్లో మోసాలు జరుగుతాయని, ఫోన్‌లకు వచ్చే లింక్‌లను క్లిక్ చేయకూడదని సూచించారు. ఓటీపీ నెంబర్లు, ఏటీఎం, డెబిట్ కార్డుల పిన్ నంబర్లు, బ్యాంకు అకౌంట్ సమచారాన్ని ఇతరులకు చెపొద్దన్నారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో సులభంగా డబ్బు సంపాదించడానికి సైబర్ నేరగాళ్లు అనేక రకాల దారుల్లో మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. మోసాలపై ఫిర్యాదుకు 1930 టోల్ ఫ్రీ నంబర్, సైబర్ వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ భగవాన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, డైరెక్టర్ సోమిరెడ్డి, సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, పోలీస్ టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరయ్య సేవలు మరువలేనివి

● మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

బొమ్మలరామారం, డిసెంబర్ 7 : దూసరి వీరయ్య బీఆర్ఎస్‌కు చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ అన్నారు. మండలంలోని జలాల్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు దూసరి వీరయ్య బుధవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందగా.. గురువారం మృతదేహం వద్ద భిక్షమయ్య గౌడ్ నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గూదె బాలనర్సింహ, జూపల్లి భరత్, కట్ట శ్రీకాంత్, బండి మహేశ్‌గౌడ్, ఈరేకార్ నాగారాజు, గుమ్మడి మహేందర్‌రెడ్డి, మడిగె నర్సింహ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగానికి దరఖాస్తులు

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 7 : మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ స్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)ఉద్యోగానికి దరఖాస్తులు కోరుతున్నట్లు టీఎస్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నరేశ్ కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీఈడీ, ఎంపీఈడీ విదార్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 10 లోపు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని కోరారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన భిక్షమయ్యగౌడ్

మాజీ సీఎం కేసీఆర్‌తో ఆలేరు మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 7 : ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధైర్యపడకుండా పార్టీని బలోపేతం చేసే విధంగా కృషి చేయాలని కేసీఆర్ సూచించినట్లు భిక్షమయ్యగౌడ్ తెలిపారు.

పోస్టుమెన్, పంచాయతీ కార్యదర్శి నిర్బంధం

రాజాపేట, డిసెంబర్ 7 : ఫింగర్ ప్రింట్ పడలేదని పింఛన్ డబ్బులు ఆపారని గురువారం మండలంలోని నెమిలే గ్రామంలో పోస్ట్ మెన్ తరుణ్, పంచాయతీ కార్యదర్శి సంపత్‌ను లబ్ధిదారులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. విషయం తెలుసుకున్న ఏపీఓ దినకర్ గ్రామానికి చేరుకొని ఫించన్ డబ్బులు అందిస్తామని హామీ ఇవ్వడంతో అధికారులను వదిలిపెట్టారు. జిల్లా పోస్టల్ ఉన్నతాధికారులు సైతం గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు.

● కనిపించని రచ్చబండ కాలక్షేపం

జాలలో వెలవెలబోతున్న రచ్చబండ

గ్రామీణ ప్రాంతంలో ఒకప్పుడు వ్యవసాయ పనులు ముగిసిన అనంతరం గ్రామస్తులు రచ్చబండ వద్దకు చేరుకొని జీవన స్థితిగతులు, కష్టసుఖాలు, వ్యవసాయ అనుభవాలు, ముందస్తు పనులు చర్చించుకునేవారు. సాంకేతిక పరిజ్ఞాన ప్రభావంతో నేడు గ్రామాల్లో రచ్చబండ వద్ద కాలక్షేపాలు కనుమరుగవుతున్నాయి. నాడు రచ్చబండల వద్ద సింధుకళలు, బుర్రకథలతో కాలక్షేపం చేసేవారు. ఆనాటి కళలు ఇప్పుడు కనిపించడం లేదు. ప్రతి ఇంటికి టీవీ రావడంతో తిరిక దొరికినప్పుడల్ల వాటికే అతుక్కుపోతున్నారు.

– రాజాపేట, డిసెంబర్ 7